కథా నిలయం
2933
శ్రీకాకుళం

# తీరని బాధ

"చూసేరా రమణమ్మగారూ!...కామాక్షమ్మగారు యివాళకూడా రాలేదు. రోజూ మీ అందరికన్నా ముందు ఆవిడే వచ్చేసేవారు." అంది సీతమ్మ విస్తరంటలు కుడుతూ.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. చూసేరా ఆవిడతో పాటు వెంకాయమ్మకూడా రాలేదు. మీ యింటికి రోజూ రావడానికి వాళ్ళకి నామోషీ కాబోలు!" అంది రమణమ్మ ఈనపుల్లలు చీరుస్తూ.

"అదేం చోద్యమండీ! రోజూ వస్తున్నారుగా ... ఏదోపనిపాట్లు చక్కపెట్టుకుని నలుగురం రోజూ ఓ దగ్గర కలుసుకోని ముచ్చటగా ఏవో మాట్లాడుకోకుండా, ఎవళ్ళింటిదగ్గర వాళ్ళు ఒంటిపిల్లి రాకాసుల్లాగ కూర్చుంటే ఏం ఊసుపోతుంది చెప్పండీ యీ పల్లెటూళ్లో!"

"మీరన్నట్టు రోజూ వస్తూ వస్తూ ఏ కారణం లేకుండానే చప్పున రావడం మానేస్తే ఏమనుకోడం?...అదీగాక రెండురోజుల క్రిందటివరకూ లేని నామోషీ ఇప్పుడొచ్చి పడిందం దేవిటి మీ యింటికి రావడానికి?" తన విమర్శకు తిరిగి ప్రతి విమర్శలేదన్నట్టు గర్వంతో సీతమ్మ వేపు చూసింది రమణమ్మ.

"నిన్న సాయంత్రంమాత్రం కామాక్షమ్మగారు మా యింటికొచ్చి, నా కూతురితో అడుకుంటూన్న ఆమె

కూతురు పాపలుని తీసికెళ్ళిపోయింది— 'ఏఁవండీ ఆడుకుంటున్న పిల్ల నలా తీసుకుపోతున్నారు?' అని నే నడిగేను. 'రత్నందగ్గర, గాజుపెంకెందుకండీ?' అని గొణుక్కుంటూ పోయిందావిడ చరచరా! అదేం పోద్దెమండీ—నా కిప్పటికీ అర్థంకాలేదు సుమండీ ఆ వైఖరి!" ఆకులు దొంతిపెడుతూ అంది సీతమ్మ.

"ఓహో! ... అలా చెప్పండి మరి...! ఇప్పుడు నా కంతా అర్థమయింది. ఇదంతా ఆ వెంకాయమ్మ ఆడిస్తున్న నాటకం!"

"ఏమిటది? ... నాకేం అర్థంకాలేదు కొంచెం త్వరగా చెప్పండీ!..."

"మొన్న వెంకాయమ్మ మాయింటికొచ్చింది! ఏవో మాటలమీద మాటలొచ్చి సీతమ్మగారి కూతురు ఉమ మంచి అందంగా ఉంటుందన్నాను నేను. "అబ్బే సీతమ్మ గారి కూతురేం బాగుంటుందండీ?...బూరిబుగ్గలూ అదీను! కామాక్షమ్మగారి కూతురు పాపలు చాలా అందంగా వుంటుంది. ఎంతో ముద్దొస్తూ చక్కగా వుంటుంది పాపలు!" అంది వెంకాయమ్మ చేతులాడిస్తూ. నాకెంతైనా వొళ్లు మండింది సుమండీ!... కళ్ళతో చూస్తూకూడా ఆ పక్షపాత బుద్ధితో ఆ పేలావన యేమూ అని నాకెంతయినా చికాకేసింది సుమండీ! "ఛీ!... ఆపిల్ల మీ కంటికి ఎలా నచ్చిందండీ? అడుసు కళ్లూ అదీను!" అని నే నన్నాను. భర్ మని నాగుపామల్లే దాని సొంతకూతుర్ని అన్నట్టు లేచిపోయిందండీ! ఎంతకోపంవస్తేమాత్రం అది నన్నేం చెయ్యగలదు

మహా!— ఆ కోపంలో కామాక్షమ్మ దగ్గరికెళ్ళి మీమీద నామీదా లేనిపోనివన్నీ కల్పించి చెప్పి ఆమెకి మనమీద కోపంవచ్చేటట్టు చేసుంటుంది!- కామాక్షమ్మగారూ వెంకాయమ్మా ఎందు కిక్కడికి రాలేదో యిప్పటికి మీకు బోధపడుంటుంది!..." "ఇదేం విడ్డూరమండీ!...మీరూ మీరూ ఏదో వాదించుకుంటే మధ్య నామీదెందుకూ కామాక్షమ్మగారికి కోపం?... నేనేమైనా నాకూతురే ఆమె కూతురికన్నా బాగుంటుందని అన్నానా?... మధ్య మీరూ వెంకాయమ్మా మీ మీ ఉద్దేశాలప్రకారం వాదించుకున్నారు. ఆవిషయంలో నాతప్పేంవుంది మహా!" అంది సీతమ్మ ఆశ్చర్యంగా.

"ప్చ్!... అదొక్కటే కారణం అయివుండదండీ!- నేనంటే వెంకాయమ్మకి పీకమొయ్యా కోపంవుంది. నాకు మీరు చాలా సన్నిహితులవడంచేత, నేను చెప్పినట్టు మీరు వింటూండడంచేత ఆమె ప్రతిభేమీ బయటకు రాకుండా వుంది. అంచేత మెల్లిగా కామాక్షమ్మను దువ్వి, ఆమె తలకు లేనిపోనివన్నీ యెక్కించి, ఇక్కడకు రాకుండా వున్నట్టు చేసి, కామాక్షమ్మ యింటిదగ్గరే కొంద రమ్మలక్కలను పోగుచేసికొని తన ప్రతిభను పెంపుచేసుకుందామనుకుంటున్నది కాబోలు వెంకాయమ్మ!" అంది రవణమ్మ.

"బాగానే వుంది వరస!... కాస్త చదువుకున్నప్పటికీ కామాక్షమ్మగారు అసలు లోకజ్ఞానం లేకుండా ఉన్నారేవిటండీ?... లోకులు వాళ్ళకి తోచినట్టు అనుకోరూ!— అంతమాత్రంలో యీ ఆగ్రహం, అలక మధ్య నామీ

దెందుకు?... కావలిస్తే 'మీ కూతురే నాకూతురికన్నా అందమైంద'ని వందసార్లు ఆమె ముందు కూర్చుని అంటాను. రకరకాలుగా వర్ణించేస్తాను. అక్కడికి తీరుతుందా ఆవిడ అలక!"

"ఆ వెంకాయమ్మ పట్టి ఇచ్చకాల మనిషండీ!"... కామాక్షమ్మ మనస్సు ఆమె పూర్తిగా విరిచేసుంటుంది!"

"సరే, ఏదో కనుక్కుంటాను సంగతంతా!... అరే!... అప్పుడే పొద్దుపోయిందే! మా ఆయన ఇవాళ సినీమాకు వెళతానన్నారు. వేగిరం వంట చెయ్యాలి!" అంటూ విస్తరంటలు దొంతిపెట్టింది సీతమ్మ.

"................."

* * *

## 2

ఆ వేళ సాయంకాలం కామాక్షమ్మ యింటికి వెళ్ళి సంగతి సందర్భాలు కనుక్కోడమా, మానెయ్యడమా అనే మీమాంసలో పడింది సీతమ్మ!... అదివరకు తనకూ కామాక్షమ్మకూ ఏమైనా వైరముందా?— లేదే!— మరలాంటప్పుడు ప్రతిరోజూ వచ్చే కామాక్షమ్మ రెండురోజులై రాకపోయినప్పుడు ఎందుకు రాలేదో కనుక్కోనేటందుకు వెళ్ళడంలో తప్పేముంది?— ఆమె యెందుకు తనింటికి రావడం మానేసిందో తనకు తెలుసుగా! మరలాంటప్పుడు తనక్కడికి వెళ్ళడంవల్ల యేమైనా లాభంవుందా? కొన్నాళ్లు పాతబడితే మళ్ళీ ఆమె ఎప్పట్లాగే తనింటికి వస్తుందని ఏమిటా నమ్మకం?... సీతమ్మకేమీ అర్థంకాలేదు—

— ఒక వేళ తను ఆమె యింటికి వెళితే? కనీసం పలకరించనైనా పలకరిస్తుందా? ఎందుకు పలకరించదు?— ఒకవేళ ఆమె అలా పలుకరించనైనా పలుకరించకపోతే ఆమె పట్టి మూర్ఖురాలనే నిర్ధారణకు తను ఖచ్చితంగా రావచ్చు!- అప్పుడలాంటి మూర్ఖులస్నేహం వదులుకున్నా విచారించవలసిన అవసరం వుండదు.

సాధ్యమైనంతవరకూ జట్టీలు లేకుండా ఆ ఊళ్ళో ఉన్న కొద్దిమందీ అన్యోన్యంగా, శాంతంతో కాలక్షేపం చెయ్యాలని సీతమ్మ తలంపు. కామాక్షమ్మ అనవసరంగా తనను అపార్థం చేసుకొని ఈర్ష్యాభావంతో ఉన్నందుకు ఎంతైనా బాధపడింది సీతమ్మ. ఆ ఊళ్లోగల కొద్దిమంది అమ్మలక్కల్లోనూ విభేదాలు చెలరేగడం సీతమ్మకు సుతరామూ యిష్టంలేదు. అంచేతే కామాక్షమ్మ యింటికెళ్ళి ఆమెకి నచ్చచెప్పి, మళ్ళీ ఆమె మనస్సుని సన్మార్గంలోకి త్రిప్పాదామనుకుంది.

— సీతమ్మ వెళ్లేసరికి కామాక్షమ్మ కూతురికి అన్నం పెడుతున్నది. వెళుతూనే, "ఏం కామాక్షమ్మగారూ!" నిన్నా, యివాళా రావడం మానేసేరు? మీరు రాకపోవడం వల్ల మాయిల్లు చిన్నబోయినట్టయింది!" అంది సీతమ్మ.

మర్యాదప్రకారం "రండి, కూర్చోండి"అని మళ్ళీ—

"అబ్బే ఏమీలేదండీ!— ఏవో పనులుండి రావడం మానేసేను" అన్నది కామాక్షమ్మ సీతమ్మవేపు తిరిగి.

"మీరు రాకపోవడంచేత నిన్నా, యివాళా యేమీ ఊసుపోలేదు సుమండీ" అంది సీతమ్మ.

"ఏం!— రమణమ్మగారున్నారుగా" అంది కామాక్షమ్మ పైకుబుకుతున్న ఈర్ష్యను అణుచుకుంటూ.

"మీతో ఊసుపోయినట్టు యెలా ఊసుబోతుంది చెప్పండీ?— మీతోపాటు వెంకాయమ్మగారుకూడా రావడం మానేసేరు!— ఏంచేతో తెలియడంలేదు."

"రోజూ తప్పనిసరిగా రావడానికి తీరుబాటుండొద్దూ?— ఏవేవో పనులుంటాయి" అని వెంకాయమ్మ తరఫు సమాధానాన్నికూడా చెప్పేసింది కామాక్షమ్మ.

"అలా అంటారు పనులని!— నిజానికి మీకున్న పనులేమిటి చెప్పండీ మహా?— ముసలమ్మగారే అన్నీ చేసేస్తూ వుంటారుకదా!" అని నిలవదీసి అడిగింది సీతమ్మ.

"బాగానేవుంది!...మా యింటికే మీరు రోజూ వస్తూవుంటే తెలుస్తుంది. అప్పుడు మీరెంత తప్పనిసరిగా హాజరవుతారో చూస్తాను"అంది కామాక్షమ్మ లేని నవ్వుని తెచ్చుకుంటూ. ఖచ్చితమైన సమాధానం యిచ్చినందుకు తనలోతానే మురిసిపోయింది.

సీతమ్మగుండె టక్కున ఆగినట్లయింది!...ఔను. ఆమె అన్నట్టు వాళ్లే ప్రతీరోజూ కాలక్షేపానికి వస్తున్నారు. గాని తనెప్పుడైనా వాళ్ళిళ్ళకు వెళ్ళిందా?...లేదే!— అయితే తను వాళ్ళని మొదట్లో కోరుండి తనింటికి రమ్మని ఆహ్వానించిందా?...ఊహుఁ!—పదేళ్ళ క్రిందటినుంచీ ఆ వీధివాళ్ళంతా తమ గుమ్మంలో (అమ్మలక్కలు మాత్రం) కలియడం ఆనవాయితీ అయింది. అంతే! మరయితే అందులో తన తప్పేముంది?— లేదే!—

—సీతమ్మ కొంచెం తెలివయిందవడంచేత ప్రస్తావన మార్చి—"అయితే మీకు పనులుండి రావడం మానేసేరన డం సబబు!...పోనీ మీ పిల్ల అస్తమానం మా యింట్లోనే వుండి మా పిల్లతో ఆడుకుంటానికి వస్తూవుండేదికదా, నిన్నటినుండీ ఓమారైనా రావడం మానేసిందేం?-

కామాక్షమ్మ ఉక్కిరిబిక్కిరి అవవలసొచ్చింది. ఆ ప్రశ్నకు ఏంజవాబు చెప్పడం?—అంతలా నిలవదీసి సీతమ్మ అడుగుతుందని కామాక్షమ్మ అనుకోలేదు. సీతమ్మమీద ఆమె కోరకమైన చిరాకూ, కోపమూ కలిగినయ్!—"మీ పిల్ల మా యింటికి ఎందుకు రాలేదు?" అని యెదురుప్రశ్న వేసింది.

—ఈ ప్రశ్నకూడా చిక్కుపరిస్థితినే ఏర్పరచింది. అయినా ఎలాగో సమర్థించేసింది సీతమ్మ-"రోజూ మీ పిల్లే మా యింటికొచ్చి ఆడుకోడం అలవాటాయె! ఉండుండి ఓ నాటినుంచీ రావడం మానేస్తే..." అని వాక్యం పూర్తి చెయ్యక మునుపే—

—"ఎంచేత తోటిపిల్ల రాలేదో కనుక్కునేందుకైనా మీ పిల్లని పంపించనక్కర్లేదేవిఁటి?"

"సరి! సరి!...బోధపడింది...మా పిల్ల మీ యింటికి యికనుంచీ ఆడుకునేందుకు రావాలని మీ తాత్పర్యం!" అని అంది సీతమ్మ కొంచెం హెచ్చుస్థాయిలో.

"అయితే అక్కడికి మా పిల్లే నేమిటి మీ పిల్లకు చెలికత్తె అనుకుంటున్నారు మీ యింటికివచ్చి ఆడడానికి?"

"ఎందుకండీ వృథాగా అంతపెద్దమాటలనేస్తున్నారు.

చెలికత్తె అంటే మీ కర్థం తెలీసట్టుంది!...పోనీలెండి, ఇక నుంచీ మా పిల్లనే మీ యింటికి పంపిస్తూవుంటాను!... చక్కగా రత్నంలాగున్న మీ పిల్లతో మా పిల్ల ఆడుకుంటూవుంటే ఎంతో ముచ్చటగా వుంటుందండీ నాకు!"

"ఏదో నా ముందుగనక మా పిల్లని రత్నమనీ గిత్నమనీ పొగుడుతున్నారు!—"

"అయితే నా మనస్సులో మరో ఉద్దేశం ఉందనుకుంటున్నారా?—నిజంగా చెప్తున్నాను మా పిల్లకన్నా మీ పిల్ల ఎంతో చక్కగా వుంటుంది!"

"పోనీలెండి వెటకారానికేం?...అందచందాలు మా లాంటి సామాన్యకుటుంబాలకు ఎలావస్తాయి చెప్పండి?... అలంకరించుకోడానికి ఆభరణాలా, ఏమయినానా?"

"కామాక్షమ్మగారూ?...మీరనవసరంగా చెప్పుడు మాటలు విని నన్నపార్థం చేసుకుంటున్నారు. నామీద మీకు బాగా కోపం వచ్చినట్టుంది! నావల్ల తప్పులుంటే క్షమించండి!...మీరు రేపణ్నుంచీ మళ్ళీ అలవాటుప్రకారం మధ్యాహ్నంవేళ మాయింటికి వస్తూఉంటారని నమ్ముతాను. అటుపైని మీ దయ!... నాకు వేళయింది. మళ్ళీవస్తా!" అని సీతమ్మ లేచి నిలబడింది.

"బాగానేవుంది. మధ్య మీ మీదెందుకు నాకు కోపం?...క్షమించడానికి మీరు చేసిన తప్పేమిటి మహా!— అసలు మీ నీడనుచూసి మీరే బెదురుతున్నారు. తీరుబడి ఉంటే వస్తూవుంటాన్లెండి" అంది కామాక్షమ్మ రాననే భావం వ్యక్తమయేలా!...

## 3

మర్నాటినుంచీ యథాప్రకారం కామాక్షమ్మ వచ్చేస్తుందని సీతమ్మ అనుకుందిగాని ఆమె రాలేదు!...

కామాక్షమ్మ యింటిదగ్గర ఓ అమ్మలక్కలసంఘం తయారైంది. వెంకాయమ్మా ఆమె మిత్రురాండ్రందరూ అక్కడ గుమిగూడడం మొదలెట్టేరు.

తమ పూర్వపుసంఘంలో చీలిక లేర్పడి, కొందరు వేరుపడి క్రొత్తగా మరోదగ్గర సమావేశమవుతున్నప్పటికీ, అట్టే విచారించక ఇంకొందరు క్రొత్తమెంబర్లను ప్రోగుచేసి, సీతమ్మయింటిదగ్గర అనుదిన సమావేశాన్ని బలపరచడం మొదలెట్టింది రవణమ్మ!...

మొత్తానికి ఆ వూళ్ళో రెండు ముఠా లేర్పడ్డాయి!...

సీతమ్మనీ, రవణమ్మనీ ఆ తక్కిన ముఠావాళ్ళనూ ప్రతిరోజూ విమర్శించడం, ఆ సీతమ్మకూతురు ఏమీ బాగుండదనీ, అందవికారమైనదనీ కామాక్షమ్మదగ్గర అని ఆమె సంతృప్తి చెందేటట్లు ఇచ్ఛకం కొట్టడం - కామాక్షమ్మ ముఠావాళ్ళకి అనుదిన కార్యక్రమాలలో ఒకటయింది!...

—కామాక్షమ్మ మంచిదే అయినప్పటికీ, వెంకాయమ్మవల్ల ఆమె చెడ్డదవుతున్నదనీ, సీతమ్మకూతురు అందమైనదన్నంత మాత్రంలో, మధ్య సీతమ్మను అసహ్యించుకొని కోపం తెచ్చుకోడం, కామాక్షమ్మ తెలివితక్కువతనానికి నిదర్శనమనీ, ఆమె లోలోపల ఎంత కుమిలికుమిలి ఏడ్చినా సీతమ్మకూతురి అందం ఆమెకూతురికి రాదనీ, సీతమ్మకున్నపాటి విశాలహృదయం, జ్ఞానం, అనుభవం

ఆమెకు లేవనీ—ఈ విధంగా రవణమ్మ ముఠావాళ్ళు, వాళ్ళని విమర్శిస్తూ కాలక్షేపం చేస్తున్నారు. రవణమ్మ ముఠాలో వాళ్ళు వాళ్ళని విమర్శిస్తూ కాలక్షేపం చేసేవారు.

నిజానికి సీతమ్మ, కామాక్షమ్మల కూతుళ్ళిద్దరిలోనూ, ఫలానాపిల్ల అందమైనదని నిర్ధారణచేసి చెప్పలేం! ఇద్దరు పిల్లలూ ఒకరికొకరు తీసిపోనట్టుంటారు. అందుకే వచ్చిందా చిక్కుపరిస్థితి!...కొంద రిటూ కొంద రటూ తమతమ అభిప్రాయాలను వెలిబుచ్చేరు; వారివారి దృక్పథాలను ఆధారంగా చేసికొని!...

అయితే కామాక్షమ్మ, సీతమ్మలలో మాత్రం ఒక భేదం ఉంది!—సీతమ్మకూతురు బాగుంటుందనీ, సీతమ్మ మంచి తెలివైనదనీ యెవరైనాఅంటే ఆమె హృదయంలో పొదగబడివున్న ఈర్ష్యా అసూయలు భీకరరూపాన్ని దాల్చి వికృతనాట్యం చేసేది! తనకూతురే అందమైనదనీ, తను తెలివైనదని లోకులందరూ అనాలని ఆమెకోరిక!...ఒక్క పై విషయాలలోనే కాదు, ప్రతివిషయంలోనూ ఆ రకం మనస్తత్వంగల మనిషే ఆమె.

—కానీ సీతమ్మ మనస్తత్వం అలాంటిది కాదు. లోకులు తనను పొగిడినా పొగడకపోయినా భయపడేదికాదామె. లోకులలో భిన్నాభిప్రాయాలుంటాయని ఆమెకి తెలుసు! ఆత్మవిశ్వాసంగల మనిషి సీతమ్మ! తన కూతురు బాగులేదనీ, తను తెలివితక్కువదనీ కామాక్షమ్మ ముఠావాళ్ళన్నా అంతగా నొచ్చుకునేదికాదు సీతమ్మ!

కామాక్షమ్మకి ఆత్మవిశ్వాసం లేదు. ఆమె కెప్పుడూ

సొంత అభిప్రాయాలూ, ఉద్దేశాలూ ఉండేవి కావు. ఎప్పుడూ ఒకరు చెప్పినవి నమ్ముతూ, ఒకరి అభిప్రాయాల పైననే ఆధారపడి ఉండేది!...అందుకే ఆమె ఎప్పుడూ బాధపడుతూ వుండేది!...

## 4

ఓరోజున సీతమ్మకూతురి పుట్టినరోజు వచ్చింది. ఆ రోజున సీతమ్మ మరీమరీ రమ్మని ఆహ్వానం పంపడంచేత వెళ్ళడం తప్పనిసరైంది కామాక్షమ్మకి!... మానేస్తే బాగుండునని మొదటనుకుందిగానీ అంతలా పిలచినప్పుడు వెళ్ళడం మానేస్తే మధ్య లోకులేమనికూస్తారో అనే భయం చేత వెంకాయమ్మతో కలసి పేరంటానికి వెళ్ళింది.

అక్కడ ఆమె భరించలేని అవమానం పొందినట్లు తలంచుకుంది!...

–అందరూ రావడం సీతమ్మకూతుర్ని ఎత్తుకొని, ముద్దాడి, మణిపూసఅనికొందరూ, రత్నాలభరిణఅనికొందరూ అందాల రాణీ అని కొందరూ, తిలోత్తమ అని కొందరూ, రంభ అని కొందరూ—రకరకాలుగా వర్ణించాలని లేకపోయినా కనీసం ఇచ్చకం కోసమైనా వర్ణించేయడం మొదలెట్టేరు. గమ్మత్తేమిటీ అంటే అలావర్ణించినవాళ్ళలో కామాక్షమ్మ ముఠాలో వాళ్ళుకూడా ఉన్నారు.

తనకూతురిని ఒక్కరూ ముద్దులాడక, అందంగా వున్నదని పొగడకపోవడంచేత, అక్కడున్న వాళ్ళందరి మీదా కోపంవచ్చింది కామాక్షమ్మకు. కానీ ఒక్కర్తే ఏం చెయ్యగలదు? దుఃఖం దిగమింగుకు కూర్చుంది.

సీతమ్మమాత్రం కామాక్షమ్మ కూతురిని ముద్దులాడి..."ఏం పాపలూ, మాయింటికి రావడం మానేసేవు?" అంది.

"మా అమ్మ వెళ్ళొద్దంది" అని చటుక్కున చెప్పేసిందా అమాయకురాలు పాపలు.

—అందరిమధ్యా భరించలేని అవమానం పొందినట్టు భావించుకుంది కామాక్షమ్మ. "ఏమిటే ముండా!... నే వెళ్ళొద్దన్నానా?..." అని 'ఛెళ్'న పాపలు నడ్డిమీద కొట్టింది కామాక్షమ్మ. బావురుమంటూ ఏడుపు మొదలెట్టిందా అమాయకురాలు!...

"అదేవిటండీ!...చిన్నపిల్ల నలా కొట్టేసేరు?" అన్నారంతా.

"చూసేరా!... ఆవేళ వానపడుతున్నప్పుడు వెళ్తానంటే వెళ్ళొద్దన్నాను. అప్పట్నుంచీ యెవ్వడూ మీ యింటికి వెళ్ళొద్దన్నాననుకొని రావడం మానేసింది కాబోలు! ...నాకేం తెలుసు!...చూసేరా ఎలా చెప్తున్నదో!" అని ఎలానో సమర్థించబోయేరు ఆవిడ!

—ఎంత సమర్థించినప్పటికీ రవణమ్మకిమాత్రం నవ్వాగలేదు. నవ్వేసింది!... ఆ మురా వాళ్ళందరూ లోలోపల నవ్వుకున్నారు.

అవమానం సహించలేకపోయింది. తగిన ప్రతిక్రియ సీతమ్మకి చెయ్యాలనుకుంది కామాక్షమ్మ - మరి మూడు మాసాలలోనే తనకూతురి పుట్టినరోజు కూడాను!...ఆ రోజున తన మురావాళ్ళచే సీతమ్మకూతురు బాగులేదని అని

పించి ఆమెని అపమానపరుద్దామని అనుకుంది. ఏమైనాసరే తగిన ప్రతీకారం చెయ్యాలనే నిశ్చయానికి వచ్చిందామె!...

కానీ సీతమ్మ ఆ చిన్న విషయంకోసం యెప్పుడూ బాధపడదు!...కావలిస్తే ఆనాడు సీతమ్మకూడా అందరితోనూ కలిసి ఆమె కుమార్తెని తెగ వర్ణించేస్తుంది!—అసలెవరైనా సరే ఆ పరిస్థితిలో పేరంటానికని పిల్చినతరువాత వాళ్ళింటికెళ్ళి వాళ్ళపిల్లను ఎత్తుకొని ముద్దులాడుతారు; మర్యాదకోసమైనా అందంగా వుందని వర్ణించేస్తారు!

ఎలానూ సీతమ్మకూతురి పుట్టినరోజు జరిగినట్టే. కామాక్షమ్మకూతురి పుట్టినరోజుకూడా జరుగుతుంది. కాని తనలాగ సీతమ్మ నొచ్చుకొని అవమానం పొందినట్లు 'ఫీ'లవదని కామాక్షమ్మకేం తెలుసు!...

## 5

సీతమ్మని బాగా అవమానపరుద్దామనీ, నలుగురి మధ్యా ఆమెకూతురికన్నా తనకూతురే అందమైందని ఋజువుచెయ్యాలని ఎన్నోకలలు కంది కామాక్షమ్మ. కానీ కన్న కలలన్నీ కన్నీళ్ళయి ఊరుకున్నాయి!...

మాయదారి స్ఫోటకం!... కామాక్షమ్మ కూతురి ఆకృతినే మార్చేసింది!—పిల్ల పుట్టినరోజునాడు కనీసం వాళ్ళముట్టుకు వాళ్ళయినా తిండి తినకుండా గడిచిపోయింది!...

“సీతమ్మగారి కూతురి అందాన్నిమించి తేజంతో ఎంతో అందంగా వుండేదండీ!... పావం ఎలా అయిపోయిందో!” అని కొందరూ—

—"రంభ, ఊర్వశులు, ఏమాత్రం అన్నట్టుండే దండీ! ప్చ్!...ఎలా అయిపోయిందో" అని కొందరూ!

"నిజానికి ఇంత అందమైనపిల్లను నే నెక్కడా చూడ లేదు సుమండీ!...సీతమ్మగారికూతురు అందమైందే అయినా అడుసు కళ్ళుండడంచేత, మీ పిల్లముందు తీసికట్టుగా వుం డేది! ఇంతకీ యింత అందమైనపిల్ల భూలోకంలోఉండడం భగవంతుడికూడా యిష్టంలేదు కాబోలు!"—అని కొం చెం వేదాంతాన్నికూడా ఉపయోగిస్తూ కొందరూ— రకరకాలుగా తమ సానుభూతుల్ని తెలియజేసేరు.

—ఆ పరిస్థితిలో లోకులు తనకూతురే సీతమ్మ కూతురికన్నా అందమైందనిఅంటే సంతోషించడం?-భయం కర అగ్నిజ్వాల నడుమ ఆమెహృదయం కొట్టుకోడం మొద లెట్టింది!...

కన్నీటితో సీతమ్మకూడా సానుభూతి తెలియజేసింది! కామాక్షమ్మ కూతురి వేపు చూసింది శరీరంమీద యెక్కడా ఖాళీ లేకుండా అరంగుళంలో తుగాతలు పడివున్న తన కూతురి వేపు చూసింది. సీతమ్మమీదపడి బావురుమని ఏడ వడంతప్ప మరేం చెయ్యలేకపోయింది కామాక్షమ్మ!...

"పోనీ బ్రతికుంది. అంతేచాలు మనకి!!" అని ఓదా ర్చింది సీతమ్మ.

పాపం తన కూతురు నిజంగా ఎంతో అందంగా ఉన్న న్నాళ్లూ ఊళ్ళో పిల్లలందరికన్నా అందంగా లేదేమోనని బాధపడేది ప్రతిక్షణం !!...మరి ఇప్పుడు ??...ఆమె జీవి తాంతంవరకూ తీరనిబాధ అయింది!...